

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర పరిశీలన

తిరుపతి రూరల్: వేమూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను గురువారం జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న సహాయ వ్యవసాయ సంచాలకులు సందర్శించారు.



పోస్టర్ల ఆవిష్కరణ

తిరుపతి అర్బన్: పర్యావరణహిత నిమజ్జనమే పరిపూర్ణ నిమజ్జనం' పోస్టర్లను గురువారం ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే విజయశ్రీ, కాలుష్య నియంత్రణ మండలి అధికారి మదన్ మోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆవిష్కరించారు.

శాస్త్రోక్తంగా వరాహ స్వామి జయంతి

తిరుమల: తిరుమలలోని భూవరాహ స్వామి ఆలయంలో గురువారం స్వామివారి జయంతిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం కలశస్థాపన, కలశ పూజ, పుణ్యాహవచనం చేపట్టారు. వేదమంత్రాల నడుమ మూలమూర్తులకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వరద బాధితులకు అండగా టీటీడీ ఉద్యోగులు



ఈవో శ్యామలరావును కలిసిన టీటీడీ ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి(అలిపిరి): విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు టీటీడీ ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయని.. టీటీడీ ఉద్యోగ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తెలిపారు. గురువారం వారు ఉద్యోగుల ఒక్కరోజు మూల వేతనం లెక్కకట్టి తమకు చెక్కు రూపంలో అందించాలని ఈఓ జె.శ్యామలరావును కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించేలా తమకు అవకాశం కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొన్నారు.

డాక్టర్ వైఎస్సార్ యూనివర్సిటీ డైరెక్టర్‌గా గోవిందరాజులు



వెంకటగిరిరూరల్: వెంకటగిరి కృషివిజ్ఞాన కేంద్రం ప్రధానశాస్త్రవేత్తగా వ్యవహరిస్తున్న గోవిందరాజులు పశ్చిమ గోదావరి జిల్లా వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు స్థానిక కృషివిజ్ఞాన కేంద్రంలో పలువురు శాస్త్రవేత్తలు బీజీరాజులకు అభినందలు వ్యక్తం చేశారు

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 57,390 మంది స్వామివారిని దర్శించుకోగా 20,628 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.45 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో పూర్తవుతోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్‌లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.

ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వి.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉన్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తుందన్నారు. డిసెంబరు 8వ తేదీ నిర్వహించనున్న ఈ స్కాలర్‌షిప్ పరీక్షకు ఈ నెల 17వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 పరీక్ష రుసుము చెల్లించి ఈ నెల 10వ తేదీ నుంచి ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఉన్న ఎస్‌బీఐ కలెక్ట్ లింకు ద్వారా చెల్లించాలని సూచించారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలకు "డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.బీఎస్ఈ.ఏపి.జీఓవీ.ఇన్" వెబ్‌సైట్‌ను చూడాలని డీఈఓ కోరారు.

నేత్రదానంతో పునర్జన్మ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వరన్

తిరుపతి తుడా : నేత్రదానం పునర్జన్మ సాధ్యమని, ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం రుయా ఆస్పత్రి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీని ఆరోగ్యశాఖ అధికారులతో కలసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మరణానంతరం కళ్లు నశించిపోకుండా ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించి పునర్జన్మ పొందే అవకాశం పొందాలన్నారు. మరణించిన వ్యక్తి సమాచారాన్ని 6 గంటల్లోపు వైద్య సిబ్బందికి తెలియజేస్తే నేత్రాలను సేకరిస్తారన్నారు. నేత్రదానానికి 8500880126 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ర్యాలీలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, రుయా సూపరింటెండెంట్ రవి ప్రభు, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, చలపతి రెడ్డి, శాంతికుమారి, ఏఆర్ఎంఓ హరికృష్ణ, మధుబాబు, డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

గురువులు నవసమాజ నిర్మాతలు

సమాజం అనే దేవాలయానికి నిజమైన రక్షకుడు ఉపాధ్యాయుడు.. మనలోని అజ్ఞానాన్ని పారదోలి, విజ్ఞానాన్ని పంచే ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పది. నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడి స్థానం అత్యున్నత శిఖరం.. దేశ భవిష్యత్‌కు అడుగులు పడేందుకు తరగతి గదిలోనే మార్గనిర్దేశం చేస్తారు. మనిషి ఎదుగుదలకు నిచ్చెన వేసే అక్షర కార్మికుడు టీచర్. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులు అర్పించారు.

డాక్టర్ సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, ప్రిన్సిపల్స్



- ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో బోధనలకు పదును పెట్టాలి
- వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు
- ఎస్వీయూలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తిరుపతి సిటీ: గురువులు నవసమాజ నిర్మాతలు అని, అధ్యాపకుడు నిరంతర విద్యార్థిగా కొత్త విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలని ఎస్వీయూ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు అన్నారు. గురువారం ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత మేధావని, ఆయన లోతైన విషయాలపై సమగ్ర విశ్లేషణలతో విద్యార్థులకు బోధన చేశారన్నారు. భావి భారతావనికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, సరికొత్త పరిశోధనలు, నూతన విద్యావిధానం, దేశీయ అంతర్జాతీయ వర్సిటీలతో ఎంఓయూలతో పాటు ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. అనంతరం 21 మంది అధ్యాపకులకు వీసీ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందజేశారు. రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్స్ తులసి రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న వారు వీరే

సైన్స్ విభాగంలో నాగలక్ష్మీదేవమ్మ(బోటనీ), రాజశేఖర్ (జువాలజీ), విశ్వనాథ రెడ్డి(సెకాలజీ), పద్మజ(కెమిస్ట్రీ), జయసుబ్బారెడ్డి, సుధాకరయ్య(గణితం) దేవప్రసాద్ రాజు (ఫిజిక్స్), చరితాదేవి(వైరాలజీ), మధుసూదనరెడ్డి, మాధవి(కెమిస్ట్రీ), అనురాధ(హోమ్ సైన్స్) అవార్డు లు అందుకున్నారు. అలాగే ఆర్ట్స్ విభాగం నుంచి ప్రొఫెసర్ సుందరవల్లి (ఇంగ్లిషు), భాస్కర్ రెడ్డి(ఆర్కియాలజీ), శివశంకర రెడ్డి(ఫిజికల్ ఎడ్యుకేషన్), జానకి రామయ్య(ఎడ్యుకేషన్), శ్యాంమోహన్ డేవిడ్ రాజు, సునీత(ఎకనామిక్స్), అరుణ(లింగ్విస్టిక్స్), రామ్‌ప్రకాష్(హిందీ), శారద, సుమకిరణ్ (ఇంగ్లిష్), రాజేశ్వరమ్మ (తెలుగు) అవార్డులు అందుకున్నారు. కామర్స్ అండ్ మేనేజ్మెంట్ నుంచి జయచంద్రా రెడ్డి (కామర్స్), కేశవులు రెడ్డి (కంప్యూటర్ సైన్స్) పురస్కారాలు అందుకున్నారు.

టీచర్లను సన్మానించడం మన బాధ్యత

తిరుపతి ఎడ్యుకేషన్ : నవ సమాజ స్థాపనలో గురువుల బాధ్యత గురుతరమైనదని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ప్రజాప్రతినిధులు తెలిపారు. తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో గురువారం జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి గురు పూజోత్సవం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దడంలో గురువుల పాత్రే కీలకమని తెలిపారు. విద్యార్థులు ఉన్నత భవిష్యత్‌ను అందుకునేందుకు ప్రస్తుత కాలానుగుణంగా విద్యాబోధనలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులు అందిపుచ్చుకుంటూ వినూత్న బోధనకు కృషి చేయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా సహకారం అందించాలని కోరారు. సామాజిక విలువలు, నైతికత వంటి అంశాలపై పిల్లల్లో అవగాహన కల్పించాలని కోరారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం పురోగతి

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యారంగం ఎంతో పురోగతి సాధించిందని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిపట్ల గురుమూర్తి తెలిపారు. నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్లకు కొత్త వైభవం తెచ్చిందని, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు చదువు ప్రసాదించిందని గుర్తు చేశారు.

గురువులను సన్మానించడం మన బాధ్యత

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిని ఇనుమడింపజేసిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం గర్వంగా ఉందన్నారు. గురువు లేని లోకాన్ని ఊహించుకోలేమని, అలాంటి గురువులను సన్మానించుకోవడం మనందరి బాధ్యత అని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. అనంతరం జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 72 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, డీఈఓ డాక్టర్ వి.శేఖర్, డీవైఈఓలు బాలాజీ, ప్రభాకర్‌రాజు, శాంతి, ఎంఈఓలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సావేరి సెమినార్ హాలులో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజిని, అధ్యాపకులు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ సిబ్బంది అవిశ్రాంత కృషి వల్ల తిరుపతి మహిళా వర్సిటీకి ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. అనంతరం విశేష కృషి చేసిన అధ్యాపకులకు పురస్కారాలను అందించారు. పలువురు ప్రొఫెసర్లు పలు అంశాలపై చూపిన అంశాలకు సంబంధించి అవార్డులు అందుకున్నారు.



డాక్టర్ రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ఉమ, అధ్యాపకులు

పర్యావరణ హిత పులికాట్‌కు చర్యలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్

తిరుపతి అర్బన్: పులికాట్ ఎకో సెన్సిటివ్ జోన్ కమిటీ ఏర్పాటుతో పలు సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో పులికాట్ ఎకో సెన్సిటివ్ జోన్ ఆఫ్ పులికాట్ బర్డ్ సాంక్చురీ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు పర్యావరణ హితంగా, పులికాట్ పక్షుల అభయారణ్యం కోసం చేపట్టవలసిన చర్యలు, సాగరమాల కింద పూడికతీతకు నిధుల విడుదలకు చర్యలు చేపడతామన్నారు. అలాగే ఇరకంకుప్పంలో త్వరలోనే పట్టాల పంపిణీ చేస్తామన్నారు. 80 వేల మంది ప్రజలకు సంబంధించిన సదరు అంశాలను త్వరితగతిన పరిష్క రిస్తామని తెలిపారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, న్యూఢిల్లీ వారి ఉత్తర్వుల మేరకు రాష్ట్ర అటవీ శాఖ సమాచారం మేరకు కమిటీ ఏర్పాటైనట్లు తెలిపారు. కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్, పాండిచ్చేరి ఫౌండర్ అండ్ డైరెక్టర్ యూనివర్సల్ ఎకో ఫౌండేషన్, బూబేష్ గుప్తా, రాజశేఖర్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ, ఎస్వీయూ, గోపి సైంటిస్ట్ (వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ రెప్రజెంటేటివ్ డెహ్రాడూన్) ఈఈ, రీజనల్ ఆఫీస్, పీసీబీ, ప్లానింగ్ ఆఫీసర్ తుడా శామ్యూల్, డీఎఫ్ఓ, వైల్డ్ లైఫ్ డివిజన్ సూళ్లూరుపేట ఇన్‌చార్జ్ పులికాట్ బర్డ్ శాంక్చురీ మెంబర్ సెక్రటరీతో కమిటీ ఏర్పాటైనట్లు చెప్పారు.



పులికాట్ సరస్సు అభివృద్ధిపై చర్చిస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీ, అధికారులు

బోట్ మరమ్మతులకు నిధులు ఇస్తా..

తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ పులికాట్ లేక్ ప్రాంత పరిధిలో సుమారు 80 వేల మంది నివసిస్తున్నారని, పులికాట్ సరస్సు ఏపీలో సుమారు 400 కి.మీ.లు విస్తరించి ఉందన్నారు. బర్డ్ శాంక్చురీ ఏర్పాటైన తర్వాత సదరు గ్రామాలకు కొత్త రోడ్డు వేయాలన్నారు. ఇరకం దీవిలోని పిల్లలకు విద్యాపరంగా వారు ప్రయాణించే బోట్ ఇంజిన్ మరమ్మతులకు ఎంపీ లాడ్స్ కింద నిధులు ఇస్తామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ సిపాయి, ఎమ్మెల్యే నెలవల వియశ్రీ, వైల్డ్ లైఫ్ డీఎఫ్ఓ శామ్యూల్, పర్యాటక శాఖ ఆర్డీ రమణప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపేంద్రనాథ్ రెడ్డి, మత్స్యశాఖ డీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదిమూలంను అరెస్ట్ చేయాలి

- ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- బాధిత మహిళకు న్యాయం చేయాలి
- ఐద్వా, డీవైఎఫ్ఐ నేతల డిమాండ్

తిరుపతి కల్చరల్: మహిళా నాయకురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడడమే కాక అత్యాచారం చేసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేసి వేధించిన ఎమ్మెల్యే ఆదిమూలంను వెంటనే అరెస్ట్ చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సాయిలక్ష్మి, డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యాయుడు ఎస్.జయచంద్ర, రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.హేమలత డిమాండ్ చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళా నాయకురాలిపై సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వేధింపుల దుశ్చర్యను వ్యతిరేకిస్తూ గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం సర్కిల్లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తనపై వేధింపులకు పాల్పడడంతో పాటు అత్యాచారం చేసి బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని బాధితురాలు ప్రెస్ ద్వారా తెలియజేసిందన్నారు. ముందుగా సీఎం చంద్రబాబు నాయుడికి తనకు న్యాయం చేయాలని, ప్రాణహాని ఉందని లేఖ రాశానని వారు పట్టించుకోకపోవడంతో న్యాయం కోసం ప్రెస్ ముందుకు వచ్చి చెప్పిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఎమ్మెల్యే పదవి నుంచి ఆదిమూలంను బర్తరఫ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, నాయకురాళ్లు కోమలమ్మ, లలితమ్మ, సంధ్య, మహాలక్ష్మి, రమాదేవి, రాజు, యుగంధర్ పాల్గొన్నారు.



ఆదిమూలం లైంగిక వేధింపులను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న ఐద్వా, డీవైఎఫ్ఐ, రైతు సంఘ నేతలు

ఎంబీయూలో టీచర్స్ డే



సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మోహన్‌బాబు

చంద్రగిరి: మండలంలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని టీచర్స్ నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైఎస్‌ఆర్ సీపీ నాయీబ్రాహ్మణ విభాగం అధ్యక్షుడిగా పుల్లయ్య



తిరుపతి మంగళం: వైఎస్ ఆర్ సీపీ నాయీబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా తొండమల్ల పుల్లయ్య నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. నాయీబ్రాహ్మణుల సంక్షేమానికి నిరంతరం శ్రమిస్తానని పుల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

సింథటిక్ టెన్నిస్ కోర్టు ప్రారంభం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ప్రకాశం భవన్ సమీపంలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సరికొత్త సింథటిక్ టెన్నిస్ కోర్టును గురువారం టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ రామ్‌కుమార్ ఆవిష్కరించారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు, డైరెక్టర్ ఆఫ్ ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



టెన్నిస్ కోర్టును ప్రారంభిస్తున్న రామ్‌కుమార్, వీసీ

వేదిక్ వర్సిటీలో సామవేద ఉపకర్మ

తిరుపతి సిటీ: క్రోధి నామ సంవత్సరం దక్షిణాయన వర్షాకాలం భాద్రపద మాసం శుక్లపక్ష ద్వితీయ తిథి సందర్భంగా గురువారం వేదిక్ వర్సిటీ సంధ్యావందనం హాల్‌లో హస్తా నక్షత్ర సమవేద ఉపాకర్మ అత్యంత వైభవంగా నిర్వహించారు. దేహశుద్ధి కోసం పంచగవ్య సేవించడం, జ్ఞానాన్ని పంచే మహర్షులను, రుణబాధలు తొలగడం కోసం రుషులను పూజించడం, విద్యార్థుల అధ్యయన సామర్థ్యానికి యజ్ఞోపవీతం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వీసీ రాణిసదాశివమూర్తి, రిజిస్ట్రార్ రాధా గోవింద్ త్రిపాఠి, హెడ్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యశర్మ, విభాగాధిపతి గిరిజాప్రసాద్ షాడంగీ, సామవేద విద్యార్థులు పాల్గొన్నారు.



సామవేద ఉపాకర్మ కార్యక్రమం నిర్వహిస్తున్న వేదిక్ వర్సిటీ విద్యార్థులు

ఓటరు జాబితాను పటిష్టంగా రూపొందించండి

- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఫొటో ఎలక్టోరల్ జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ 2025ను బీఎల్ఓ ఇంటింటి సర్వే చేపట్టి పారదర్శకమైన, లోపాలు లేని డ్రాఫ్ట్ ఫొటో ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల అధికారులు, బీఎల్ఓలతో వర్చువల్ విధానంలో ఆయన సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. బీఎల్ఓలు చేపట్టిన గృహ సర్వేలో ఓటర్ల జాబితా పరిశీలించి మార్గదర్శకాల మేరకు ఎలక్టోరల్ జాబితా ఎపిక్‌లో గుర్తించిన ఏదైనా లోపాలను సవరించి, చిత్ర నాణ్యత మెరుగుపరచడం, పోలింగ్ స్టేషన్లు, సరిహద్దుల ఖరారు వంటి ప్రాథమిక సవరణ కోసం కార్యచరణలు చేపట్టాలని సూచించారు. ఒక కుటుంబంలోని వారు అందరూ ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలో ఉండేలా వారితో మాట్లాడి డూప్లికేషన్ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఈ అక్టోబర్ నాటికి 18 ఏళ్లు నిండిన వారిని, అలాగే జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండబోతున్న వారిని గుర్తించి నూతన ఓటరుగా నమోదు చేయాలని ఆదేశించారు. అక్టోబర్ నెల 19వ తేదీ నుంచి 28 అక్టోబర్ వరకు ఫారం 1 నుంచి 8 వరకు 2025 జనవరి 1వ తేదీ నాటికి సంబంధించిన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ తయారు చేయాలన్నారు. అలాగే ముసాయిదా ఓటర్ జాబితా 2024 అక్టోబర్ 29 నాటికి లోపాలు లేకుండా ప్రచురించాల్సి ఉంటుందని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, ఎస్డీసీ రామ్‌మోహన్, నరసింహులు ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్ష



భారత గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో అమలవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను భారత గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ ఆశిష్ గుప్తా గురువారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు రోజుల జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను స్థానిక కలెక్టరేట్‌లో గురువారం కలిసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను, ప్రగతిని వివరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర జాయింట్ కమిషనర్ శివప్రసాద్, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ వారి ఆధ్వర్యంలో జిల్లాలో నరేగా కింద వివిధ పనులు చేపడుతున్న శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా పీడీ జిల్లాలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల ప్రగతిని పూర్తిస్థాయిలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా, గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా వివరించారు. దీనిపై డిప్యూటీ సెక్రటరీ ప్రత్యేకంగా కలెక్టర్ ఆధ్వర్యంలో పీడీని అభినందించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్‌నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ విజయ్ కుమార్, నరేగా అధికారులు, సిబ్బందితదితరులు పాల్గొన్నారు